# సీమ వార్త
తెలుగు దినపత్రిక

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

పేజీలు : 4 ఆదివారం 10 మే 2026


## నీటి కొరత ఉంటే.... ట్యాంకర్లతో నీరు అందించండి.

.....వేసవి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు.

.....జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్.






పుట్టపర్తి, మే 9 సీమ వార్త

కలెక్టరేట్ లోని మినీ కన్ఫరెన్స్ హాలు నందు జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామస్థాయిలో ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆర్బిబిఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన కీలక సూచనలు చేశారు. ఆర్డబ్ల్యూఎస్ వన్ యాప్ , వాటర్ ట్రాన్స్‌పోర్టేషన్ రిపోర్టులను ప్రతిరోజూ అప్డేట్ చేస్తూ, గ్రామాల వారీగా నీటి సరఫరాను పర్యవేక్షించాలి.నీటి కొరత ఉన్న చోట వెంటనే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, అవసరమైతే ప్రైవేట్ బోర్లను వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.క్షేత్రస్థాయిలో పైపులైన్లు, మోటార్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. నీటి నమూనాలను పరీక్షించి, క్లోరినేషన్ ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడాలి.జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని, జిల్లాలో నిర్మాణంలో ఉన్న 271 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. "నీటి సమస్యల విషయంలో రాజీ పడకూడదు, ప్రజలకు కనీసం 55 ఎల్ పీసీడీ నీరు అందేలా చూడాలి" అని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమం లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ మురళీధర్,గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, ఇంజినీర్లు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.




## ఆ హామీలకు ఆవిరి....
# "డి" కొనలేక "డి"సప్పాయింట్..!

- ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి
- అసలు అమలుకి నోచుకోని పథకాలు మూడు.
- కళ్ల ల్లో ఆనందాన్ని నింప లేని......కార్పోరేషన్ లోన్లు
- స్త్రీ శక్తి( ఉచిత బస్సు)తో సంతృప్తి.
- మిగిలిన హామీలు అడగడం మరచిన మహిళలు).
- నీరసించిన యువశక్తి-- స్థానిక సంస్థల ఎన్నికలు దూరం.
- ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశంలేని ప్రజలు.
- ఏడాది గడిచాక తల్లికి వందనం....ఉచిత బస్సు.
- కొందరికే అందిన ఉచిత సిలెండర్
- కొత్త పింఛన్ల ఊసు లేదు.. ఉన్న పింఛన్లకు ఎసరు.
- ఇంటి స్థల పట్టాల పంపిణీ ప్రసక్తి లేదు... ప్రారంభానికి నోచుకోని టిట్కో గృహాలు.
- స్థానిక ప్రజలతో ఎమ్మెల్యేలకు సంబంధాలు శూన్యం
- అసంతృప్తితో ఉన్నా ఉద్యమించలేని పరిస్థితి ప్రజలది
- అసంతృప్తితో అట్టుడుకుతున్న ఉద్యోగులు




## మా ప్రతి అడుగులో వాల్మీకుల సపోర్ట్..!!

....ఎస్టీ జాబితా కోసం వాల్మీకుల పోరాటంలో తొలి అడుగు పరిటాల సునీతమ్మదే

....ధర్మవరంలో వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణలో....పరిటాల శ్రీరామ్

....కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అంబికా, మధుసూదన్ రెడ్డి, ఇతర నాయకులు

....అట్టహాసంగా సాగిన విగ్రహావిష్కరణ, వందల సంఖ్యలో పాల్గొన్న వాల్మీకులు

ధర్మవరం మే 9 సీమ వార్త.

ఎస్టీ జాబితా కోసం వాల్మీకులు చేసిన పోరాటంలో అప్పట్లో తొలి అడుగు వేసింది రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మేనని ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్లో వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ పండుగ వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ తో పాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జనసేన నేత చిలకం మధుసూదన్ రెడ్డి ఇతర ముఖ్య నాయకులు, వందల సంఖ్యలో వాల్మీకులు పాల్గొన్నారు. నాయకులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి ప్రజలకు ఒక అద్భుతమైన సందేశంతో కూడిన గ్రంథాన్ని అందించారన్నారు. కుటుంబ విలువలు, మనుషుల మధ్య సంబంధ బాంధవ్యాలు ఎలా ఉండాలన్నది రామాయణం ద్వారా చెప్పారన్నారు. ఇది కేవలం - మిగతా3లో



## ఖాకీ ల కన్నెర్రతో ...
## "గంట" లో "గండం" తప్పింది..!!

.....ధర్మవరంలో రైతు కిడ్నాప్ కేసును గంటలోనే చేదించిన..వన్ టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్.

....ఆరుగురు నిందితులు అరెస్ట్- వారిపై...రౌడీ షీటర్ నమోదు.

...భూ వివాదమే కిడ్నాప్‌కు కారణం....ఇంచార్జ్ డీఎస్పీ నరసింగప్ప.

....ఇన్నోవా కారులో కిడ్నాప్ చేసిన ఆరుగురు అదుపులోకి.

....కుంటిమద్ది సమీపంలో నిందితులను పట్టుకున్న పోలీసులు.

....ప్రామిసరీ నోట్లు, సెల్‌ఫోన్లు, వాహనాలు స్వాధీనం.

....వన్ టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్ ను, ఎస్సై ఉమాదేవినీ , పోలీసు సిబ్బందిని అభినందించిన డీఎస్పీ నర్సింగప్ప.



# వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి.







- వాల్మీకి అడుగుజాడల్లో అందరూ నడవాలి.
- జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి.

ధర్మవరం మే 09 సీమ వార్త ;

రామాయణ రచయిత అందరికీ ఆదర్శప్రాయుడు వాల్మీకి అడుగుజాడల్లో అందరూ నడవాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలోని యర్రగుంట సర్కిల్ నందు నిర్వహించిన వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, అనంతపురం జిల్లా పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి చూపించిన ధర్మమార్గం సమాజానికి అందించిన స్ఫూర్తి చిరస్మరణీయమని ఆయన భారతీయ సంస్కృతి, సాహిత్యానికి చేసిన సేవలు అమూల్యమని వాల్మీకి మహర్షి సందేశాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అలాగే ప్రజలు ఐక్యంగా ఉండి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు , బోయ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్‌కు ఘన సన్మానం







- పుట్టపర్తి ఏవో కార్యాలయంలో సందడి చేసిన తెలంగాణ స్నేహితులు.

పుట్టపర్తి మే09 (సీమవార్త బ్యూరో) :-

శ్రీ సత్యసాయి జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న సుదర్శన్ ఈ నెల 29న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో,ఆయనకు అరుదైన గౌరవం దక్కింది.దశాబ్దాల కాలం గడిచినా చెదరని స్నేహబంధానికి వేదికగా పుట్టపర్తిలోని వ్యవసాయ శాఖ కార్యాలయం నిలిచింది.సుదర్శన్ ఇంటర్మీడియట్ బైపిసి బ్యాచ్ స్నేహితులు తెలంగాణ రాష్ట్రం నుండి ప్రత్యేకంగా ఒకరోజు ముందుగా తరలివచ్చి, రాయలసీమ రుచులను ఆస్వాదించి,ఆయనను ఘనంగా సత్కరించారు.?ఉద్యోగ బాధ్యతల్లో బిజీగా ఉన్నప్పటికీ పాత మిత్రులను కలుసుకోవడం సుదర్శన్‌ను ఎంతో ఉద్వేగానికి గురిచేసింది.తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆయన సహాధ్యాయులు,సుదర్శన్‌తో ఉన్న పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.మిత్రులందరూ కలిసి సుదర్శన్‌ను శాలువాతో కప్పి,పూలమాలలు వేసి, జ్ఞాపికను అందజేశారు.పదవీ విరమణ అనేది ఒక బాధ్యత నుండి విముక్తి మాత్రమేనని,కానీ మిత్రుల మధ్య అనురాగం ఎప్పటికీ నిలిచి ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అనంతరం తన స్నేహితులకు పిడి చిరు కానుకలను అందజేశారు.

**కృతజ్ఞతలు తెలిపిన పీడీ సుదర్శన్**

ఈ సందర్భంగా పీడీ సుదర్శన్ మాట్లాడుతూ.. సుదూర ప్రాంతం నుంచి తనపై ఉన్న ప్రేమతో తరలివచ్చిన మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తన వృత్తి జీవితంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించడంలో మిత్రుల ప్రోత్సాహం కూడా ఉందన్నారు.పదవీ విరమణ తరుణంలో స్నేహితుల సమక్షంలో ఈ సన్మానం జరగడం తన జీవితంలో మర్చిపోలేని తీపి జ్ఞాపకమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రాయలసీమలో ప్రపంచంలో పండే ఉద్యాన పంటలను అన్నింటిని ఇక్కడ రైతులు పండిస్తున్నారని,కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉద్యాన పంటలు పండించడానికి రైతులకు ప్రభుత్వ పథకాలు, సహాయ సహకారాలు అందించడంలో భాగస్వామ్యం అయినందుకు రైతుబిడ్డగా తనకు ఎంతో సంతోషం,సంతృప్తి ఇచ్చిందన్నారు.వ్యవసాయ రంగంలో ఉద్యాన పంటలు రైతులకు ఆదాయాన్ని సమకూర్చడంలో ముందు వరుసలో ఎలా ఉంటాయో,అదేవిధంగా జిల్లా అధికారులలో ఏపీఎంఐపీ పిడి సుదర్శన్,డిహెచ్ఓ చంద్రశేఖర్ లు కూడా అలానే ఉంటూ రైతులకు కుటుంబ సభ్యులులాగా కలిసిపోయి సలహాలు సూచనలు తమ సహాయ సహకారాలు అందిస్తూ రైతు కుటుంబాలతో మమేకమై వారి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. వీరిద్దరూ ఈ సందర్భంగా తమ జ్ఞాపకాలను స్నేహితులతో,రైతులతో కలసి నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుండి వచ్చిన స్నేహితులు, జిల్లా ఉద్యాన అధికారి జి.చంద్రశేఖర్, హెచ్.ఓ.నవీన్ కుమార్,ఏఈఓ ఆనంద్ నాయక్, జిల్లా మాజీ వ్యవసాయ సలహా మండలాధ్యక్షులు ఆవుటాల రమణారెడ్డి,ల్యాండ్ లార్డ్ మహేంద్ర రెడ్డి, ఏపీఎంఐపీ సిబ్బంది మరియు సుదర్శన్ మిత్రబృందం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అట్టహాసంగా అమ్మవారి ఊరేగింపు..

- ఆకట్టుకున్న కీలుగుర్రాళ్ల వేషధారణలు
- కనువిందుపరిచిన దుర్గమ్మ విన్యాసాలు
- మారుమ్రోగిన పిల్లల గ్రోవి

గాండ్లపెంట, మే9 సీమ వార్త....



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



ఆకట్టుకున్న దుర్గమ్మ వేషధారణ లు

గంగాభవాని 18వ వార్షికోత్సవం లో భాగంగా శనివారం సాయంత్రం గాండ్లపెంట గంగాభవాని అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం అట్టహాసంగా సాగింది. నంద్యాలకు చెందిన కళాకారులు చేపట్టిన దుర్గమ్మ విన్యాసాలు, పీలేరుకు చెందిన పిల్లన గ్రోవి కోలాటం, కీలుగుర్రాళ్ల వేషధారణలు, కళాకారులు చేపట్టిన చెక్కభజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారు మండల కేంద్రంలో పురవీధుల గుండా భక్తులకు దర్శనమిచ్చారు. ముఖ్యంగా బెజవాడ కనకదుర్గమ్మ విన్యాసాలు, పలు దేవుళ్లకు చెందిన కీర్తనలకు కళాకారులు చేపట్టిన నృత్య ప్రదర్శన సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దారి పొడువునా మహిళలు అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి గ్రామోత్సవం ముందు యువతులు నూనె దీపాలతో అమ్మవారి ఎదుట ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రథోత్సవం ముందు డప్పులు వాయిద్యాలు, పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. అడుగడుగునా అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు మహిళలు, యువతులు పెద్ద ఎత్తున వీధుల్లోకి తరలివచ్చారు. అమ్మవారి వార్షిక తిరుణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై సుమతి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నటరాజ్ శెట్టి, ఆనంద్, లక్ష్మీ నరసింహ గౌడ్, మల్లికార్జున, మహేష్, ఓబుల రెడ్డి, కోటేశ్వర్లు, గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మంచినీటి ట్యాంకర్లు సరఫరా చేయడానికి సిద్ధం

మడకశిర మే 9 సీమ వార్త




నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వేసవిలో త్రాగునీటి సమస్య ఉన్న పంచాయతీలకు ఉచిత మంచినీరు ట్యాంకర్ల సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దానిలోన భాగంగా గానే హిందూపురంలో మాలే సముద్రం పెద్ద ఫ్యాక్టరీ లో కొత్త ట్యాంకర్లు తయారు చేయిస్తున్నారు . అక్కడికి వెళ్లిన సీనియర్ టిడిపి సుబ్బారెడ్డి , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుంచిటిగ వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ ఎన్.లక్ష్మీనారాయణ, సి.కొడిగేపల్లి మాజీ సర్పంచ్ మల్లెగౌడ్ పాల్గొని ట్యాంకర్ల పరిస్థితిని సమీక్షించారు. ఉచిత ట్యాంకర్లు నియోజకవర్గంలో పంపిణీ చేస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ మార్కెట్ యాడ్ డైరెక్టర్ కెంచ్చ యాదవ్ తెలిపారు. ముందు జాగ్రత్త తెలియగా నియోజకవర్గంలో ఏ మండలంలోనూ తాగునీటి సౌకర్యం లేకుండా సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు.

## కాకినాడలో బాలల హక్కులపై డా. శ్రీనివాస మూర్తి గట్టి హెచ్చరిక

- పి ఓ సి ఎస్ ఓ, బాల్య వివాహాలు, బాల కార్మికత్వంపై కఠిన చర్యలు తప్పవు

మడకశిర మే 9 సీమ వార్త



కాకినాడ జిల్లాలో నిర్వహించిన ఏపీ ఎస్సీ పిసిఆర్ సామీక్ష సమావేశంలో బాలల భద్రత, హక్కుల పరిరక్షణపై కీలక చర్చలు జరిగాయి. కమిషన్ చైర్మన్ ఏవి ఎస్ ఎస్ ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ ఎస్ సి పి సి ఆర్ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస మూర్తి , కమిషన్ ఇతర సభ్యులు, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ , అలాగే వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో పి ఓ సి ఎస్ ఓ కేసుల పర్యవేక్షణ, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, విద్యార్థుల భద్రత, హాస్టళ్లు మరియు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. పి ఓ సి ఎస్ ఓ కేసుల్లో వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, బాల్య వివాహాలు ,బాల కార్మికత్వంపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. హాస్టళ్లలో ఆర్ ఓ ప్లాంట్లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీరు వంటి సదుపాయాలను పాఠశాలలు ప్రారంభానికి ముందే సిద్ధం చేయాలని ఆదేశించారు. పిల్లల హక్కుల విషయంలో ఏపీ ఎస్ సి పి సి ఆర్ ఎలాంటి రాజీ పడదు” అని డాక్టర్ శ్రీనివాస మూర్తి దోని స్పష్టం చేశారు.

## పురం లో... మజ్జిగ సేవలో కైవారం తాతయ్య సేవా టీం.

.... అధ్యక్షులు రవి శంకర్ ఆధ్వర్యంలో... 18 చోట్ల మజ్జిగ చలి వేంద్రాలు.

హిందూపురం మే 09 సీమ వార్త





సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి హిందూపురం వారి ఆధ్వర్యంలో 582రోజు నిత్య అన్నసంతర్పణ చేయడం జరిగింది ఈరోజు సేవాకర్తలు సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి ప్రెసిడెంట్ రవిశంకర్ ది అలాగే 120లీటర్ల మజ్జిగ సేవ రవిశంకర్ దే పట్టణంలో ఎండలు తీవ్రం కావడంతో ఇప్పటికే 18 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఒక్క రోజుకి సుమారు 9000 రూపాయల నీళ్లు కు ఖర్చువుతుంది కాబట్టి ఈ జలప్రసాద సేవకు ప్రజల సహకరించవలసిందిగా కోరుచున్నాము అలాగే తాత గారి భక్తుడు హిందూపురం వాసి జల ప్రసాద సేవకు ఒక్క ట్యాంకుకు 500 రూపాయలు ఇవ్వడం జరిగింది.వారి కుటుంబాలకు శ్రీ క్షేత్ర కైవారం తాత ఆశీస్సులు ఉండాలని మనసారా కోరుకున్నారు.

## ఆంధ్రప్రదేశ్ గ్రూప్ వన్ అధికారిగా ధర్మవరం కి చెందిన కే. సాయి గౌతమ్.

- యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలో డిప్యూటీ మేనేజర్ హోదాకు ఎంపిక.

ధర్మవరం మే 09,సీమ వార్త ;



ధర్మవరం పట్టణానికి చెందిన కే. సాయి గౌతమ్ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్లో డిప్యూటీ మేనేజర్ హోదాలో ఎంపికయ్యారు. వీరు ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లాలో గ్రూప్ వన్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు పుట్టపర్తి లోని శ్రీ సత్య సాయి హయ్యర్ సెకండరీ స్కూల్లో విద్యాభ్యాసం పూర్తి చేసి బీటెక్, ఎంటెక్ గోల్డ్ మెడలిస్ట్ గా ప్రతిభ కనబరిచారు. వీరి తండ్రి కె. వినాయక ప్రసాద్ విద్యుత్ శాఖలో డివిజనల్ ఇంజినీర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. తల్లి జి. సుశీల గృహిణి. సోదరుడు డా. ప్రవీణ్ గౌతమ్ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ లో మెడికల్ సైన్స్ లో ఆర్థోపెడిక్ సర్జన్‌గా సేవలందిస్తున్నారు. అలాగే సాయి గౌతమ్ సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూను 3 సార్లు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఇంటర్వ్యూను 3 సార్లు, ఏపీపీఎస్సీ గ్రూప్ వన్ ఇంటర్వ్యూను 3 సార్లు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా 100 మందికి పైగా సివిల్ సర్వీసెస్ ర్యాంకర్లకు మార్గదర్శకత్వం అందించారు. అంతేకాకుండా పట్టణంలోని దేవీ నర్సింగ్ హోమ్ అధినేత కు మేనల్లుడు అవుతారు.మొత్తం మీద వీరి ఎంపిక పట్ల పలువురు విద్యావేత్తలు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉద్యానవన పంటలను సందర్శించినఉద్యాన అధికారి

అమరాపురం మే 9 సీమవార్త



అమరాపురం మండల పరిధిలోని గుణేపల్లి గ్రామంలో ఉద్యాన పంటలను ఉద్యానవన శాఖ అధికారి మహేష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి తోటల పరిస్థితిని పరిశీలించినారు. వేసవికాలంలో నీటి కొరత సమయంలో తోటలను ఎలా సంరక్షించుకోవాలో పలు సూచనలు,సలహాలను రైతులకు తెలియజేశారు. ముఖ్యంగా బిందు తుంపర సేద్యం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించడం, మల్చింగ్ చేయడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించడంతోపాటు దెబ్బతిన్న మొక్కలకు ప్రత్యేక సంరక్షణ చర్యలు తీసుకోవడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా అధికారులు రైతులతో సమావేశమై బోర్ల నీటిని నియంత్రిత పద్ధతిలో వినియోగించాలని సూచించారు. తోటలు పూర్తిగా దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. భూగర్భ జలాలను సంరక్షించే విధానాలు మరియు అవసరమైన సాంకేతిక సహాయాన్ని కూడా అందించారు. భూగర్భ జలమట్టం పడిపోవడం ద్వారా రైతుల బోర్లలో నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో రైతులు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన ఆపరేషన్స్ సింధూర్ వార్షికోత్సవ వేడుకలు.

- ప్రభుత్వ బాలుర ఎన్సిసి విద్యార్థులు.

ధర్మవరం మే 9 సీమ వార్త;




ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలుర ఎన్సిసి విద్యార్థులు(ఎన్సిసి క్యాడేట్స్) నిర్వహించిన పెహలిగాం ఉగ్రదాడిపై జరిగిన ఆపరేషన్ సింధూర్ వార్షికోత్సవ సందర్భంగా ఘనంగా ర్యాలీని నిర్వహించారు.జాతీయ భావంతో సైనికుల సేవలను స్మరించుకుంటూ దేశ రక్షణలో వారి ప్రాధాన్యతను తెలియజేస్తూ పౌరులకు ధైర్యాన్నిస్తూ ఈ కార్యక్రమంలో ఆపరేషన్ సింధూరపై నినాదాలు ఇస్తూ ప్రతి ఒక్కరూ దేశ రక్షణలో ఐక్యత సేవా భావంతో మెలగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణప్ప , సీటీవో నాగేంద్ర, ఉపాధ్యాయులు వేణుగోపాల్, రమేష్, శ్రీనివాసులు, ఎన్సిసి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ వివాదంతో బెదిరింపులు

**- పోలీసుల విచారణలో బాధితుడు**

ఓబులదేవరచెరువు (ఏప్రిల్10)సీమవార్త:



ఓడి చెరువు మండలంలోని బాబాసాహెబ్ పల్లి లో భూ వివాదంతో ఓ వ్యక్తి బెదిరింపు చర్యలకు పాల్పడినట్లు తెలుస్తోంది.కదిరి ప్రాంతంలో ఉన్న ఓ భూమికి సంబంధించి ఆర్థిక లావాదేవీల విషయంలో సమస్య ఏర్పడడంతో బాబాసాహెబ్ పల్లి లో బెదిరింపు చర్యలు జరిగినట్లు సమాచారం. అయితే సమాచారం అందుకున్న పోలీసులు బాబాసాహెబ్ పల్లికి చేరుకొని ఈ సంఘటనపై విచారిస్తున్నట్లు తెలుస్తోంది.మరింత సమాచారం పోలీసుల విచారణ అనంతరం తెలిసే అవకాశం ఉంది.

## ఉచిత మంచినీరు ట్యాంకర్ల సరఫరా



మన మడకశిర ప్రియతమైన MLA ఎమ్మెస్ రాజు గారు మరియు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గారు వేసవిలో త్రాగునీటి సమస్య ఉన్న పంచాయతీలకు ఉచిత మంచినీరు ట్యాంకర్ల సరఫరా చేయడానికి హిందూపురంలో మాలే సముద్రం పెద్ద ఫ్యాక్టరీ లో కొత్త ట్యాంకర్లు తయారు చేయిస్తున్నారు , అక్కడికి వెళ్లిన సుబ్బారెడ్డి గారు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుంచిటిగ వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ ఎన్.లక్ష్మీనారాయణ, సి.కొడిగేపల్లి మాజీ సర్పంచ్ మల్లెగౌడ్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ విద్యా శిక్షణలో సింగపూర్ లో మెరిసిన - జాబిలి

పెనుకొండ మే9 సీమవార్త.




సింగపూర్‌లోని ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఎన్ఐఈ) నందు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరుపున నిర్వహించిన అంతర్జాతీయ విద్యా అధ్యయన యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఉపాధ్యాయుడు, కవి మరియు సామాజిక సేవాకార్యకర్త జాబిలి చాంద్ బాషా 'అంతర్జాతీయ విద్యా విధానం మరియు ఆధునిక బోధనా పద్ధతులు' అన్న అంశంపై తన శిక్షణను మే 04, 2026 నుండి మే 08, 2026 వరకు (5 రోజులు).విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు గాను,జాబిలి చాంద్ బాషా ఎన్ఐఈ ప్రతినిధులు మరియు ఆంధ్రప్రదేశ్ ఎస్.సి.ఈ.ఆర్.టి డైరెక్టర్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా అభినందన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఎంపిక చేసిన 37 మంది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.అంతర్జాతీయ వేదికపై సింగపూర్ విద్యా విధానాలను అధ్యయనం చేస్తూ, మన రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఎస్.సి.ఇ.ఆర్.టి.డైరెక్టర్ కృష్ణారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.25 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతూ రాష్ట్ర విద్యాభివృద్ధిలో తనవంతు సేవా చేస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన చాంద్ బాషా ఈ గౌరవాన్ని అందుకోవడం పట్ల పలువురు ఉపాధ్యాయులు,విద్యావేత్తలు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.



## హనుమాన్ శోభాయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

ధర్మవరం రూరల్ మే 09 సీమవార్త :



మే 12వ తారీఖున హనుమాన్ జయంతి సందర్భంగా ధర్మవరం పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ దేవాలయం లో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొనడం జరిగింది.ధర్మవరం బిజెపి రూరల్ అధ్యక్షులు గోట్లూరు చంద్ర మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన జరగనున్న హనుమాన్ శోభాయాత్రలో ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రతి హిందూ బంధు మిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.భక్తి, ధైర్యం, సేవాభావానికి ప్రతీక అయిన హనుమంతుడి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి రూరల్ అధ్యక్షులు గోట్లూరు చంద్ర వి. హెచ్.పి జిల్లా సహ కార్యదర్శి దేవరకొండ రామాంజనేయులు, ధర్మవరం ప్రఖండ అధ్యక్షులు శేషాద్రి, బజరంగ్దళ్ జిల్లా సంయోజక్ హర్షవర్ధన్, ప్రఖండ కార్యదర్శి మనోహర్, ప్రఖండ గోరక్ష ప్రముఖ చిట్టా ప్రసాద్, సమరసత సేవ ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ నాగరాజు, విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ,ఎస్.ఎస్.ఎఫ్ మరియు పలు హిందూ సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.

## ఘనంగా వెంటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం.

పెనుకొండ మే 9 సీమ వార్త.



పట్టణంలోని మెయిన్ బజార్ లోన్ ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యారాధన, నిత్యహోమబలి, అభిషేక మహోత్సవం, దీపాలంకరణ సేవ,పార్వాటోత్సవం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.
అనంతరం హనుమాన్ చాలీసా కీర్తనలు నాట్యం నిర్వహించారు.

# ధర్మవరం రూరల్‌లో కేబుల్ వైర్ దొంగలు అరెస్ట్

**- ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న రూరల్ పోలీసులు**

**- 100 మీటర్ల కేబుల్ వైర్ దొంగిలించిన లోకేష్,రాకేష్**

**- నిందితుల వద్ద నుంచి కేబుల్ వైర్ స్వాధీనం**

**- లోకేష్‌పై 8, రాకేష్‌పై 13 కేసులు నమోదు**

**- నిందితులను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు**

**రూరల్ సీఐ ప్రభాకర్ వివరాల వెల్లడి**

ధర్మవరం రూరల్ మే 09 సీమవార్త :




ఇటీవల మండల పరిధిలోని పలు గ్రామాలలో కేబుల్ వైర్ దొంగలను రూరల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్ నందు రూరల్ సీఐ ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పొలాల్లో కేబుల్ వైర్లు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.ధర్మవరం మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 100 మీటర్ల కేబుల్ వైర్‌ను దొంగిలించి విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు అని తెలిపారు.ఈ క్రమంలో లోకేష్, రాకేష్ అనే ఇద్దరు నిందితులను రూరల్ ఎస్ఐ రాజశేఖర్ అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి కేబుల్ వైర్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. లోకేష్‌పై ధర్మవరం, అనంతపురం జిల్లాల్లో 8 కేసులు, రాకేష్‌పై 13 కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు.. వీరిద్దరినీ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి తనయుని జన్మదిన వేడుకలు.

మడకశిర మే 9 సీమ వార్త

మాజీ ఎమ్మెల్యే వైయస్సార్ పార్టీ సిఇసి మెంబర్ డాక్టర్ ఎం తిప్పేస్వామి తనయుడు డాక్టర్ స్వామి దినేష్ పుట్టినరోజు వేడుకలు పట్టణం లో గల డాక్టర్ ఎం తిప్పేస్వామి కార్యాలయంలో శనివారం వైయస్సార్ పార్టీ మాజీ సర్పంచులు ఎంపీటీసీలు చైర్మన్లు కౌన్సిలర్లు వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా జరుపుకోవడం జరిగింది. నాయకులు మాట్లాడుతూ నిండు నూరేళ్లు సంతోషంగా ఉన్నత పదవులలో ఉంటూ ప్రజలకు అండగా ఉండాలని ప్రతి ఒక్క నాయకులు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మెలవాయి సర్పంచ్ రంగనాథ్, ఆర్ అనంతపురం సర్పంచ్ వెంకటేష్. మాజీ మున్సిపల్ చైర్మన్ తనయుడు జయరాజ్ వైస్ చైర్మన్ రామచంద్ర రెడ్డి,



కాన్సిలర్ అంజన్ ,కోఆప్షన్ సైపుల్ల, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అలుపన పల్లి శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్ ,సోషల్ మీడియా కన్వీనర్ నవీన్, జిల్లా పంచాయతీ రాజ్ కార్యదర్శి ఆంజనేయులు,




అమరాపురం మాజీ డీలర్ ప్రసిడెంట్ శివకుమార్, పట్టణ మాజీ అధ్యక్షులు సతీష్ ,సీనియర్ నాయకులు సుధీర్ రెడ్డి, ఇతరుల పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సురేంద్రబాబు సారథ్యంలో శ్రీ భక్త కనకదాస కళ్యాణమండపం నిర్మాణాల పూర్తి

**--ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన నియోజకవర్గ కురుబ సామాజిక వర్గం**

కళ్యాణదుర్గం, మే 9, సీమవార్త

కళ్యాణదుర్గం పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా అర్ధాంతరంగా నిలిచిపోయిన శ్రీ భక్త కనకదాస కళ్యాణమండపం, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో సరికొత్త శోభతో నిర్మాణం పూర్తిచేసుకుని కురుబ సామాజిక వర్గానికి అందుబాటులోకి రావడం హర్షణీయమని నియోజకవర్గ కురుబ సంఘ నాయకులు తెలిపారు. నియోజకవర్గంలోని కురుబ సామాజిక వర్గ ప్రజలు ఎంతోకాలంగా కళ్యాణ మండపం పూర్తి కావాలని ఎదురు చూస్తుండగా, వారి విజ్ఞప్తికి స్పందించిన ఎమ్మెల్యే సురేంద్రబాబు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి సహకారంతో ఎంపీ నిధుల ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేయించి నిర్మాణ పనులు పూర్తిచేయించి నట్లు పేర్కొన్నారు. దీంతో ఎన్నాళ్లుగానో నిలిచిపోయిన కళ్యాణమండపం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుని




కొత్త కళను సంతరించుకుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కురుబ సంఘం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ, గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కురుబ సామాజిక వర్గం కోసం రూ.20 లక్షలతో శ్రీ భక్త కనకదాస కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరయ్యా యని తెలిపారు. అప్పట్లో సుమారు 70 శాతం పనులు పూర్తయ్యా యని, అనంతరం ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు నిలిచి పోయాయని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో కురుబ సామాజిక వర్గానికే చెందిన నాయకత్వం ఉన్నప్పటికీ, నిలిచిపోయిన కళ్యాణమండప నిర్మాణానికి నిధులు రాలేదని, దీంతో భవనం దాదాపు నిరుపయోగంగా మారిపోయిందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేగా సురేంద్రబాబు బాధ్యతలు చేపట్టి అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్న సమయంలో ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి ఎంపీ నిధుల ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేయించి నిర్మాణాన్ని పూర్తిచేయించారని వివరించారు. కురుబ సామాజిక వర్గ అభ్యున్నతికి ఎమ్మెల్యే సురేంద్రబాబు విశేష ప్రాధాన్యత ఇస్తున్నారని, కంబదూరు రోడ్డులో స్వంత నిధులతో శ్రీ భక్త కనకదాస విగ్రహాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేయడం కూడా గర్వకారణమని తెలిపారు. శ్రీ భక్త కనకదాస కళ్యాణమండపం పూర్తి కావడంతో నియోజకవర్గ కురుబల ఆశయం నెరవేరిందని, ఇందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు కురుబ సామాజిక వర్గ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని నాగరాజు పేర్కొన్నారు.

# వ్యాపార వేత్తలతో ఎస్ఐ అవగాహన సమావేశం





**- సీసీ కెమెరాలు -- సమాజ భద్రతకు మూడో కన్ను**

సోమందేపల్లి మే 9 సీమ వార్త

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో వ్యాపార సంస్థలు, దుకాణదారులు మరియు వివిధ వ్యాపార వేత్తలతో సీసీ కెమెరాల ఏర్పాటు వాటి ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నర్సింగప్ప, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ రాఘవన్ , సోమందేపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ఐ సుధాకర్ యాదవ్ పాల్గొని వ్యాపార వేత్తలకు సీసీ కెమెరాల అవసరం, ప్రయోజనాలు, భద్రతా పరమైన ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సీసీ కెమెరాలు కేవలం రికార్డింగ్ పరికరాలు మాత్రమే కాకుండా నేరాలను అరికట్టే అత్యంత సమర్థవంతమైన భద్రతా సాధనంగా మారాయని తెలిపారు. సీసీ కెమెరాల వల్ల కలిగే ప్రయోజనాలు:దొంగతనాలు, చోరీలు, దాడులు వంటి నేరాలను ముందుగానే నిరోధించవచ్చునని నేరం జరిగిన సందర్భంలో నిందితులను త్వరగా గుర్తించడానికి సహాయ పడుతుందని, వ్యాపార సంస్థల వద్ద జరిగే అనుమానాస్పద కదలికలను పర్యవేక్షించవచ్చునని ఉద్యోగులు, వినియోగదారుల భద్రత పెరుగు తుందని ,రాత్రివేళల్లో కూడా పర్యవేక్షణ సులభమవుతుందని,రోడ్డు ప్రమాదాలు, గొడవలు, ఇతర సంఘటనల సమయంలో కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని, వ్యాపార ప్రాంతాల్లో పోలీస్ పర్యవేక్షణకు తోడ్పడతాయని,అధికారులు ప్రత్యేకంగా తెలియజేసినది ఏమనగా,ప్రతి దుకాణం, షాపు వ్యాపార సంస్థ తమ పరిసర ప్రాంతాలు, రోడ్డు వైపు, ప్రవేశ ద్వారాలు కనిపించేలా నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యాపార వేత్తలకు ఇచ్చిన ముఖ్య సూచనలు: కనీసం 15 నుండి 30 రోజుల వరకు ఫుటేజ్ స్టోరేజ్ ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని రాత్రివేళల్లో కూడా స్పష్టంగా కనిపించే నైట్ విజన్ కెమెరాలు ఉపయోగించాలని విద్యుత్ సమస్యల సమయంలో పనిచేసేలా బ్యాకప్ ఏర్పాటు చేసుకోవాలని కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా అనే విషయాన్ని తరచుగా తనిఖీ చేయాలని ప్రధాన రోడ్లు, క్యాష్ కౌంటర్లు, గిడ్డంగులు, ప్రవేశ ద్వారాలపై ప్రత్యేకంగా కెమెరాలు ఏర్పాటు చేయాలని "ప్రతి షాప్‌కు సీసీ కెమెరా -- ప్రతి వీధికి భద్రత" ఈ నినాదంతో వ్యాపార వేత్తలందరూ స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు పిలుపునిచ్చారు. డీఎస్పీ నర్సింగప్ప గారు మాట్లాడుతూ "సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో నేరాల శాతం గణనీయంగా తగ్గుతుంది. పోలీసులకు మాత్రమే కాదు, ప్రజల భద్రతకు కూడా ఇవి ఎంతో ఉపయోగపడతాయి" అని తెలిపారు. ఎస్.ఐ మాట్లాడుతూ.. "ప్రజల సహకారం ఉంటేనే భద్రమైన సమాజాన్ని నిర్మించగలం. ప్రతి వ్యాపార వేత్త తమ దుకాణం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేయడం ద్వారా నేర నియంత్రణలో భాగస్వామి కావాలని తెలిపారు.వ్యాపార వేత్తలు కూడా పోలీస్ శాఖ సూచనలను స్వాగతిస్తూ, భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని తెలిపారు.

# డే డ్రోన్, నైట్ విజన్ డ్రోన్ ఆపరేటింగ్ పై పోలీసులకు ప్రత్యేక శిక్షణ





**సోమందేపల్లి మే 9 సీమ వార్త**

జిల్లా పోలీస్ అధికారి సతీష్ కుమార్ ఉత్తర్వుల మేరకు శనివారం సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ సిబ్బందికి డే డ్రోన్ మరియు నైట్ విజన్ డ్రోన్ ఆపరేటింగ్ పై ప్రత్యేక హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ నిర్వహించారు. ఈ శిక్షణను జిల్లా హెడ్‌క్వార్టర్స్ నుండి వచ్చిన సాంకేతిక నిపుణులు మరియు పోలీస్ సిబ్బంది అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ సుధాకర్ యాదవ్ మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రోన్ల వినియోగంపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇవ్వడంతో పాటు, భవిష్యత్తులో పోలీసింగ్‌లో డ్రోన్ల ప్రాముఖ్యత ఎంతగానో పెరగనున్నదని వివరించారు. ప్రత్యేకంగా డ్రోన్లను క్రింది అంశాలలో సమర్థవంతంగా వినియోగించవచ్చని తెలియజేశారు. లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణ, భారీ జనసమ్మర్ధం ఉన్న ప్రాంతాల మానిటరింగ్, ఓపెన్ డ్రింకింగ్, గంజాయి, అక్రమ కార్యకలాపాల గుర్తింపు, రాత్రివేళల్లో నైట్ విజన్ ద్వారా గస్తీ, తప్పిపోయిన వ్యక్తుల అన్వేషణ, రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల పరిశీలన, సరిహద్దు మరియు నిర్మానుష ప్రాంతాల పర్యవేక్షణ, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, ముఖ్య ప్రదేశాల భద్రత, డ్రోన్ టెక్నాలజీ ద్వారా తక్కువ సమయంలో విస్తృత ప్రాంతాలను పర్యవేక్షించడం సాధ్యమవుతుందని, పోలీసింగ్‌ను మరింత ఆధునికంగా మరియు సమర్థవంతంగా మార్చడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ ఐ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానం పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషించనుందన్నారు. ప్రజల భద్రత కోసం ఆధునిక టెక్నాలజీ వినియోగంలో మా సిబ్బంది ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంటామని తెలిపారు.

# మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో పేదలకు కంటి వెలుగులు.

- ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా వందలాది మందికి కంటి చూపు.
- 396 మందికి విజయవంతమైన క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు.
- 370 మందికి ఉచితంగా ఖరీదైన కంటి అద్దాల పంపిణీ.
- ఒక్కో లబ్ధిదారికి రూ.3000 విలువైన కంటి అద్దాలు.





**ధర్మవరం మే 09 సీమ వార్త:**

ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందించాలనే సంకల్పంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి మరియు ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా వందలాది మంది పేద ప్రజలకు కొత్త వెలుగులు ప్రసాదించబడుతున్నాయని మంత్రి కార్యాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. సంస్కృతి సేవా సమితి సహకారంతో, శంకర నేత్రాలయ (శంకర నేత్రలయ -- యు ఎస్ ఏ ) ఆధ్వర్యంలో మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా గత నెల 8వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో మొత్తం 1000 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొంది. అందులో కంటిశుక్లం సమస్యతో బాధపడుతున్న 396 మందికి అత్యాధునిక పద్ధతిలో క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించింది. శస్త్రచికిత్సలు అనంతరం రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వారికి అవసరమైన తదుపరి వైద్య సేవలను కూడా అందిస్తున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ క్రమంలో శనివారం ధర్మవరం పోతుకుంట ఏరియా ఆసుపత్రిలో శంకర నేత్రాలయ నిపుణులైన వైద్యులచే రెండో విడత ఫాలోఅప్ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వివరించింది. ఈ పరీక్షల్లో భాగంగా 200 మంది లబ్ధిదారులను వైద్యులు పరిశీలించగా, వారిలో 190 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్లు పేర్కొంది. వారికి తగిన విధంగా ప్రత్యేక లెన్స్‌ల కొలతలు తీసుకున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారులతో కలిపి మొత్తం 370 మందికి జూన్ 24న ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ఒక్కో కంటి అద్దం విలువ దాదాపు రూ.3000 వరకు ఉంటుందని, ఇంత ఖరీదైన అద్దాలను పూర్తిగా ఉచితంగా అందించడం సేవా కార్యక్రమంలో భాగంగా చేపట్టిన విశేష చర్యగా పేర్కొంది. అదేవిధంగా పరీక్షలు నిర్వహించిన 200 మందిలో మరింత ప్రత్యేక వైద్య సేవలు అవసరమైన 10 మందిని చెన్నైలోని బేస్ హాస్పిటల్‌కు రెఫర్ చేసినట్లు వెల్లడించింది. అక్కడ వారికి అవసరమైన అధునాతన చికిత్సలు, వైద్య సేవలు అందించనున్నట్లు మంత్రి కార్యాలయం వివరించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులతో నాణ్యమైన కంటి వైద్యం పొందలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా మారిందని పేర్కొంది. మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధతో ప్రజలకు కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు, మందులు, తదుపరి వైద్య పరీక్షలు, ఖరీదైన కంటి అద్దాలు వరకు అన్నీ ఉచితంగా అందించడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి కార్యాలయం వారు తెలియజేశారు.

# వీరశైవ లింగాయత్ రెడ్డి సమాజ్ చే ప్రముఖులకు సన్మానం



**బళ్లారి, మే 9 సీమవార్త:**

ఆదివారం సాయంత్రం, నగరంలోని బసవ భవన్‌లో వీరశైవ లింగాయత్ రెడ్డి సమాజ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 'మహాసాధ్వి హేమారెడ్డి మల్లమ్మ జయంతి' కార్యక్రమంలో భాగంగా, జిల్లా యంత్రాంగం, కన్నడ మరియు సంస్కృతి శాఖ, నగర పాలక సంస్థల సహకారంతో వివిధ రంగాలలో సమాజానికి సేవలందించిన ఆరుగురు ప్రముఖులను సన్మానించనున్నట్లు సమాజ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.జె.వి. మహిపాల్ తెలిపారు. విద్యా రంగంలో చేసిన సేవలకు కిష్కింధ విశ్వవిద్యాలయ 'కలాధిపతి' డాక్టర్ యశ్వంత్ భూపాల్‌ను; సంఘ సేవకు సంగనకల్లు బసవరాజును; వైద్య రంగంలో చేసిన సేవలకు బళ్లారి వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. మంజునాథ్‌ను; న్యాయ రంగంలో చేసిన సేవలకు మాజీ మేయర్ పార్వతి ఇందుశేఖర్‌ను సన్మానించనున్నారు. సేంద్రియ వ్యవసాయంలో కృషి చేసిన సిందవాల కేశవరెడ్డిని, మీడియా రంగంలో సేవలకు గాను కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు నడవి వీరభద్ర గౌడను ఈ వేడుకలో పాల్గొనే ప్రముఖులు సన్మానిస్తారు. రేపు సాయంత్రం 4:15 గంటల నుండి, నగరంలోని కనక దుర్గమ్మ ఆలయ ప్రాంగణం నుండి మల్లమ్మ చిత్రపటంతో కూడిన ఊరేగింపు ప్రారంభమవుతుంది. వివిధ జానపద కళా బృందాల ప్రదర్శనల నడుమ ఈ ఊరేగింపు వాల్మీకి సర్కిల్ (బ్రూ సర్కిల్) మీదుగా బసవ భవనం ఆడిటోరియం వరకు సాగుతుంది. అనంతరం బసవ భవనంలో సభా కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ కె., జి ల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్ డి. పన్నేకర్, జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహమ్మద్ హరీస్ సుమేర్, అదనపు డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ జుబేర్ ఎన్., నగర పాలక సంస్థ కమిషనర్ పి.ఎస్. మంజునాథ్ తదితరులు హాజరవుతారు.

ఈ సందర్భంగా నగర ఉపన్యాసకులు బసవరాజు 'మల్లమ్మ జయంతి' విశిష్టతపై ప్రసంగిస్తారు. ఎన్. బసవరాజు బృందం హేమారెడ్డి మల్లమ్మ కీర్తనలను ఆలపిస్తుంది.

## మే 10న 'రాధాయాన్' రిలీజ్
## - తొలి టికెట్ విడుదల చేసిన జేసీ అష్మిత్ రెడ్డి

**తాడిపత్రి మే 09 సీమ వార్త:**




తాడిపత్రి పట్టణానికి చెందిన కళాకారులు నటించి నిర్మించిన 'రాధాయాన్' చిత్రం రేపు అంటే మే 10, 2026న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం శనివారం మీాూ జేసీ అష్మిత్ రెడ్డిని కలిసి తొలి టికెట్ పోస్టర్‌ను విడుదల చేయించారు. మీాూ జేసీ అష్మిత్ రెడ్డి చిత్రబృందాన్ని అభినందించి, సినిమా విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కళాకారుల ప్రతిభను ప్రోత్సహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. 'రాధాయాన్' సినిమా సాయి తేజ థియేటర్, సీబీ రోడ్డు లో ప్రదర్శించనున్నారు. తాడిపత్రి ప్రాంతానికి చెందిన కళాకారులు కలిసి నిర్మించిన ఈ చిత్రానికి స్థానిక ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. స్థానిక ప్రతిభను ప్రోత్సహించే ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టాలని చిత్రబృందం కోరుతోంది

## అంకిత లక్ష్మి-సాయిరాంల
## పెళ్లికి హాజరైన టీడీపీ, వైసీపీ నాయకులు

**తాడిపత్రి మే 09 సీమ వార్త :**



బుగ్గ సమీపంలోని నేలబెలుంలో ఉన్న శివాలయంలో శనివారం అంకిత లక్ష్మి-సాయిరాంల వివాహం ఘనంగా జరిగింది. కనకద్రిపల్లి గ్రామానికి చెందిన ఎర్రనగారి రామాంజినేయులు-సువర్ణ దంపతుల కుమార్తె అంకిత లక్ష్మితో సాయిరాం వివాహం వేద మంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ కార్యక్రమానికి వైసీపీ మాజీ సమన్వయకర్త వీఆర్ రామిరెడ్డి, వీఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకుడు లక్ష్మి రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట పలువురు వైసీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున హాజరై నూతన దంపతులకు శుభాశీస్సులు అందించారు. అనంతరం అతిథులకు విందు ఏర్పాటు చేశారు.

## జ్వాలా పెయింట్స్
## ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**గోరంట్ల మే 9 సీమ వార్త.**

గత నాలుగు సంవత్సరాలుగా గోరంట్ల పట్టణంలో ఉన్న జ్వాలా పెయింట్స్ షాప్ యజమాని ప్రతాప్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా శనివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోరంట్ల పోలీస్ స్టేషన్ సిఐ బోయ శేఖర్, పెద్దనపల్లి వెంకట్, లక్ష్యం అకాడమీ లక్ష్మీనారాయణ, బాలు, జ్వాలా పెయింట్స్ ఫౌండర్ రామాంజనేయులు, పరిగి శంకర. హాజరై క్రికెట్ టోర్నమెంట్ ని ప్రారంభించారు. సిఐ బోయ శేఖర్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలు అలవాటు పడకుండా ఇలా క్రీడారంగంపై ఆసక్తి చూపడం శుభపరిణామని క్రీడలను ప్రోత్సహిస్తున్నందుకు జ్వాలా పెయింట్ షాప్ యజమాని ప్రతాప్ ని సిఐ అభినందించారు. క్రికెట్ నిర్వాహకుడు ప్రతాప్ మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నమెంట్ 10 రోజులు పాటు నిర్వహిస్తున్నామని టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు 60,000 వేల రూపాయలు నగదు బహుమతి రన్నర్స్ కు 30,000 వేల రూపాయలు నగదు బహుమతి మరియు కప్పు అందజేయబడును. ముఖ్యంగా ఈ క్రికెట్ టోర్నమెంట్ కి విరాళం అందించిన నిమ్మల అంబరీష్, పెద్దనపల్లి వెంకట్, లక్ష్యం అకాడమీ లక్ష్మీనారాయణ, బాలు. వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు.

## తెలుగు తమ్ముని ఇంట తేనీటి
## విందులో... పార్లమెంట్ పాత్రుడు.

.... మాజీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి నరసింహులు ఇంటికి పార్థసారథి ఫ్యామిలీ.





**గోరంట్ల మే 9 సీమ వార్త.**

గోరంట్ల పట్టణంలోని ఒక శుభకార్యానికి హాజరై తిరిగి వెళుతున్న నేపథ్యంలో మండలంలోని మల్లాపల్లి కొత్తపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జిల్లా కార్యదర్శి నరసింహప్ప యాదవ్ నివాసానికి హిందూపురం పార్లమెంటు సభ్యులు బి కె పార్థసారథి తన కుటుంబ సభ్యులతో వెళ్లి తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్థసారథి తో పాటు భార్య కమలమ్మ, అల్లుడు శశి భూషణ్ పటేల్, కుమారుడు సాయి తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వృషభ దేవుడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్ బాషా, గంగంపల్లి నరసింహులు, కలగేరి వెంకట్ రెడ్డి, రామాంజనేయరెడ్డి, రెడ్డి చెరువు పల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## హోస యరగుడి పాఠశాల విలీనాన్ని
## రద్దు చేయాలంటూ గ్రామస్తుల ప్రతిఘటన





**బళ్లారి, మే 9 సీమవార్త:**

తాలూకాలోని హోస యరగుడి గ్రామంలోని పాఠశాలను కెపిఎస్ లోకి విలీనం చేయకూడదంటూ వందలాది మంది గ్రామస్తులు శనివారం నాడు గ్రామంలో ప్రతిఘటన చేపట్టారు. ఏఐడీఎస్ఓ, 'ప్రజా విద్యా పరిరక్షణ సమితి' నాయకత్వంలో, గ్రామస్తులు గ్రామం అంతటా నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ఎదుట బ్యానర్లను ఏర్పాటు చేసి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా గౌరవ క్షేత్ర విద్యాధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు. "ఈ పాఠశాల మూతపడితే, అట్టడుగు వర్గాలకు చెందిన వందలాది మంది పిల్లలు విద్యకు దూరమవుతారు. పాఠశాలను మూసివేయడమే లక్ష్యంగా రూపొందించిన 'కెపిఎస్ పథకం'కు వ్యతిరేకంగా మా పోరాటం సాగుతోంది. ప్రజల నుండి ఇంతటి వ్యతిరేకత ఉన్నప్పటికీ, ప్రభుత్వం మా పాఠశాలను మూసివేయడానికి ప్రయత్నిస్తే, మా తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుంది," అని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, ప్రజా విద్యా పరిరక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షులు గురల్లి రాజా, గ్రామ నాయకులు ఘన్ మల్లి, సుంకన్న, వీరేష్, శివశంకర్, ఎం. వీరేష్‌తో సహా పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబికా కు ఆహ్వానం పలికిన అజంతుల్లా.



గోరంట్ల మే 9 సీమ వార్త.

గోరంట్ల మాజీ కో ఆప్షన్ మెంబర్ షేక్ అజ్మతుల్లా కుమార్తె వివాహ వేడుకలు మే నెల 17 వ తేదీన గోరంట్ల మండలంలోని గుమ్మయ్య గారి పల్లి వద్ద గల ఎంఎంఎస్ ఫంక్షన్ హాల్ నందు జరుగుతున్న సందర్భంగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గారిని తప్పని సరిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి, జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దేవరకొండ ఉమా శంకర్, సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు గిరిధర్ గౌడ్, నాగే నాయక్,జయరామ్, చైర్మన్ బెల్లాల చెరువు చంద్ర, డైరెక్టర్ నబీ రసూల్, ఆదినారాయణ, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆ హామీలకు ఆవిరి....

## "డి" కొనలేక "డి"సప్పాయింట్..!!

( అనంతపురం డెస్క్ --- సీమవార్త):

2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత ప్రజలకు అంతులేని హామీలు ఇచ్చారు.అమలు సాధ్యం కాదని తెలుసు కూడా హామీలు ఇచ్చి అనంతరం ప్రజలను మాటలతో మాయ చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ప్రతిపక్షాలు విమర్శించడం సహజం.కాగా ఒక్క ఉచిత బస్సు మాయలో మహిళలు మరో డిమాండ్ చేసే అవకాశం లేకుండా బాబు మాయ చేశాడని ప్రజలు అంటున్నారు.కాగా అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ఐఆర్.. మెరుగైన పీఆర్సీ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి విదితమే.కాగా ఈ హామీ కూడా హామీగా మిగిలిపోతే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా 20 లక్షల మందికి ఉద్యోగాలు.. లేదంటే నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ.. మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా నిరుద్యోగ భృతి మాటే లేదు. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులు ఉండగా హామీ ప్రకారం ఏడాదికి మొత్తం రూ.7,200 కోట్లు చెల్లించాలి. మూడు బడ్జెట్లలోనూ పైసా ఇవ్వకుండా నిరుద్యోగులకు సీఎం చంద్రబాబు మొత్తం రూ.21,600 కోట్లు ఎగ్గొట్టారు. ఆడబిడ్డలకు రూ.97,200 కోట్ల ఎగనామం పెట్టారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలు 2.07 కోట్ల మంది ఉన్నారు. ఇందులో 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు 1.80 కోట్ల మంది ఉంటారు. వీరికి ఆడబిడ్డ నిధి కింద ఏటా రూ.18 వేలు చొప్పున ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ పథకానికి ఏటా రూ.32,400 కోట్లు అవసరం ఉంది. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు, పురుషులకు పెన్షన్ ఇస్తానని సీఎం గతంలో హామీ ఇచ్చారు. వారికి నెలకు రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.9,600 కోట్లు పెన్షన్ రూపంలో ఇవ్వాలి.

సున్నా వడ్డీ పథకం కింద స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు ఒక్కో సంఘానికి రూ.పది లక్షలు.. ఒక్కో రైతుకైతే రూ.3 లక్షలు చొప్పున రుణాలు ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

తల్లికి వందనం కింద ఒక్కొక్కరికీ ఏటా రూ.15 వేల వంతున ఏడాదికి మొత్తం రూ.13,112.82 కోట్లు ఇవ్వాలి. తొలి ఏడాది పథకం అమలు కాలేదు. 2025--26లో కేవలం 66 లక్షల మందికి రూ.6,377 కోట్లను మాత్రమే చెల్లించారు. రెండేళ్లలో ఇప్పటికే తల్లులకు రూ.19,848.64 కోట్లకుపైగా సీఎం చంద్రబాబు బకాయిపడ్డారు. ఇక ఇప్పుడు బడ్జెట్‌లో రూ.8457.07 కోట్లు మాత్రమే ప్రతిపాదించి ఏకంగా రూ.4,655.75 కోట్ల మేర కోతలు పెట్టారు. తద్వారా మూడేళ్లలో పిల్లలకు రూ.24,504 కోట్లను ఎగ్గొట్టారు!

పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 53,58,266 మంది రైతులకు అన్యాయం జరిగింది. కాగా మళ్ళీ చంద్రబాబు యధావిధిగా నోడల్ వ్యవస్థను రంగంలోకి తెచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికలను మరింత దూరం చేశారు. మరో ఏడాది లేదా రెండేళ్లకు ఈ ఎన్నికలు జరిగే సమయానికి బకాయి పడ్డ పథకాలను అమలుచేసే అవకాశాలు ఉన్నాయి.అసంపూర్తిగా పతాకాలు అమలులోఉన్నా ఎన్నికల హామీలు అమలుచేయాలని ప్రజలు గొంతెత్తేందుకు కూడా సాహసించడం లేదు.అదే చంద్రబాబు మాయాజాలం. ఏదేమైనా ఉద్యమాలకు ముందువరుసలో ఉండే మహిళలు కేవలం ఒక్క స్త్రీ శక్తి( ఉచితబస్సు) పథకం తో సంతృప్తి చెందడం ఆశ్చర్యం కలిగించే అంశం..కాగా ఎమ్మెల్యేలు సైతం పెద్దగా ప్రజలతో సరైన సంబంధాలు కలిగి ఉండడం లేదు..ప్రజలు కూడా రాజకీయాల పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు..

## మా ప్రతి అడుగులో వాల్మీకుల సపోర్ట్..!!

-మొదటిపేజీ తరువాయి





హిందువుల పవిత్ర గ్రంథం మాత్రమే కాదని.. ప్రతి మనిషి కచ్చితంగా చదివి, ఆచరించాల్సిన మార్గాన్ని సూచించిన పుస్తకమని అన్నారు. అలాంటి మహర్షి విగ్రహం ఒక ముఖ్యమైన కూడలిలో ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మందికి స్ఫూర్తిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ ఐక్యంగా నిర్వహించడాన్ని శ్రీరామ్ అభినందించారు. అంతా కలిసికట్టుగా పని చేస్తే ఆ కార్యక్రమం ఎలా ఉంటుందని చెప్పడానికి ఇదే ఒక ఉదాహరణ అన్నారు. బోయలతో తమ కుటుంబానికి ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. రాజకీయాల్లోనే కాకుండా గతంలో పరిటాల కుటుంబం చేసిన పోరాటంలో కూడా వాల్మీకులు తోడున్నారన్నారు. వారు తమ కుటుంబ సభ్యులు లాంటివారన్నారు. అందుకే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే పోరాటంలో తొలి అడుగు మంత్రిగా పరిటాల సునీతమ్మ వేశారన్నారు. అసెంబ్లీలో దీనిపై తీర్మానం ప్రవేశపెట్టి.. ఆ తర్వాత పార్లమెంట్ వరకు తీసుకెళ్లారన్నారు. ఇందులో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నేటికీ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఒక రాష్ట్రంలో ఉన్న వాల్మీకులు ఒక్కో ప్రాంతంలో ఒక్కో జాబితాలో ఉండటం సరైంది కాదన్నారు. కచ్చితంగా వారిని ఎస్టీ జాబితాలో చేర్చేలా జరిగే పోరాటంలో తమ వంతు సహకారం ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు.

# నాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం: తహశీల్దార్ భాస్కర్ రెడ్డి స్పష్టీకరణ

తాడిమర్రి, మే 09 సీమ వార్త:

తనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని, భూ వివాదానికి సంబంధించి తాను నిబంధనల ప్రకారమే వ్యవహరించానని తాడిమర్రి తహశీల్దార్ భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ భూ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. వివాదం నేపథ్యం:తాడిమర్రి మండలం, ఎం. అగ్రహారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 527-9 లో గల 4.50 ఎకరాల భూమికి సంబంధించి ఈ వివాదం నెలకొంది.1975లో క్రయవిక్రయాలు: ఆత్మకూరు నివాసి ముసుగు చిన్నప్ప వద్ద నుంచి బత్తలపల్లి మండలం ఎం. రామాపురం నివాసి ముసుగు నారాయణస్వామి 17-03-1975న (డాక్యుమెంట్ నం. 3192/1975) ఈ భూమిని కొనుగోలు చేశారు.రికార్డుల స్థితి: నారాయణస్వామి భూమిని సాగు చేసుకుంటున్నప్పటికీ, అవగాహన లేక పట్టాదారు పాస్



పుస్తకాలు పొందలేదు. దీంతో రెవెన్యూ రికార్డుల్లో పాత యజమాని చిన్నప్ప పేరు మాత్రమే కొనసాగింది.తదుపరి పరిణామాలు: చిన్నప్ప మరణానంతరం, 2017లో ఆయన భార్య లక్ష్మమ్మ తన పేరుపై పట్టాదారు పాస్ పుస్తకాలు పొందింది. అనంతరం ఆమె ఆ భూమిని పత్రపల్లెకు చెందిన కల్లే లక్ష్మీదేవికి (భర్త శివయ్య) 04-03-2024న విక్రయించగా, అది ఆటో మ్యుటేషన్ ద్వారా రిజిస్టర్ అయ్యింది.కోర్టులో వివాదం -- స్టే ఉత్తర్వులు:

ఈ క్రమంలో నారాయణస్వామి కుమారుడు ఆదినారాయణ, తమ తండ్రి 1975లోనే ఈ భూమిని కొన్నారని పేర్కొంటూ ధర్మవరం జూనియర్ సివిల్ కోర్టును ఆశ్రయించారు.ప్రస్తుతం ధర్మవరం కోర్టులో ఓఎస్ నంబర్ 472/2025 కింద విచారణ జరుగుతోంది. 31-10-2025 తేదీన గౌరవ సివిల్ జడ్జి ఈ భూమిపై తాత్కాలిక నిషేధాజ్ఞలు జారీ చేశారు.తహశీల్దార్ వివరణ: కోర్టు ఉత్తర్వుల ప్రకారం, తుది తీర్పు వచ్చే వరకు సదరు భూమిపై ఇరు వర్గాలకు ఎలాంటి హక్కులు ఉండవని తహశీల్దార్ తెలిపారు. ఈ మేరకు శాంతిభద్రతల దృష్ట్యా స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) గారికి కూడా నివేదిక పంపినట్లు ఆయన పేర్కొన్నారు. అన్ని రికార్డులు పారదర్శకంగా ఉన్నాయని, వాస్తవాలు తెలుసుకోకుండా తనపై దుష్ప్రచారం చేయడం సరికాదని ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

# ఖాకీ ల కన్నెర్రతో ..."గంట" లో "గండం" తప్పింది..!!

ధర్మవరం మే 9 సీమ వార్త ;

పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ఈనెల 8వ తేదీన రైతు ముసుగు నారాయణ కిడ్నాప్ ఘటనను పోలీసులు ఒక గంట లోనే ఛేదించారు.ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఇంచార్జ్ డిఎస్పి నర్సింగప్ప మీడియాతో మాట్లాడుతూ, ముదిగుబ్బ మండలం కమ్మవారిపల్లికి చెందిన ముసుగు నారాయణకు, ధర్మవరం పట్టణానికి చెందిన నంద్యాల రవితో 1997 సంవత్సరం నుంచి భూ వివాదం కొనసాగు తోందన్నారు.ఈ వివాదంపై మూడు నెలల క్రితం నారాయణ ఆర్డీఓ కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో శుక్రవారం మూడో వాయిదా కోసం ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన నారాయణను రవీందర్ నాయుడు,అతని కుమారుడు అరుణ్‌తో పాటు మరో నలుగురు కలిసి బలవంతంగా ఇన్నోవా కారులో ఎక్కించి కిడ్నాప్ చేశారని తెలిపారు. రాబడిన సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ వెంటనే అప్రమత్తమై పోలీసు సిబ్బందితో కలిసి ఇన్నోవా వాహనాన్ని వెంబడించి కుంటిమద్ది గ్రామ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఇన్నోవా వాహనం,ద్విచక్ర వాహనం,తో పాటు బాధితుడు ముసుగు నారాయణతో బలవంతంగా రాయించుకున్న ఐదు ప్రామిసరీ నోట్లు,సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అరెస్ట్ అయిన 6 మందిలో కే.రవీంద్ర నాయుడు వైయస్సార్ కాలనీ ధర్మవరం, కె. అరుణ్ కుమార్ వైయస్సార్ కాలనీ ధర్మవరం, పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన నారా మధుసూదన్ నాయుడు, వైయస్సార్ కాలనీకి చెందిన టి. ప్రదీప్ కుమార్, ధర్మవరం మండల పరిధిలోని పోతుకుంట గ్రామములోని పసుపులేటి ఉదయ్, వైయస్సార్ కాలనీకి చెందిన బిల్లే హరి లను (మొత్తం ఆరుగురు నిందితులు) అరెస్టు చేసి కేసు నమోదు చేసి, రౌడీషీట్లు కూడా తెరిచినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు ఎవరైనా పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నరసింగప్ప హెచ్చరించారు. ఈ కేసును అత్యంత చాకచక్యంగా తక్కువ సమయంలో ఛేధించిన వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ ను,ఎస్సై ఉమాదేవినీ, పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# సేంద్రియంలో ... కన్నడ నాట శభాష్ నితీష్..!!





**....యూట్యూబ్ లో చూసి... పొలంలో పంట సాగు చేసిన రైతు విజయ గాథ:**

**..... సేంద్రియ వ్యవసాయంలో నితీష్ రెడ్డి అమోఘ సాధన.**

**.... డ్రాగన్ ఫ్రూట్స్ సాగులో తాలూకా స్థాయి లో ఉత్తమ రైతుగా నితీష్ రెడ్డి.**

బళ్ళారి, మే 9 సీమవార్త:

కేవలం 1.67 ఎకరాల భూమిలో ఆధునిక మరియు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా లక్షల రూపాయలు ఆర్జిస్తున్న నితీష్ రెడ్డి, నేడు ఈ జిల్లాలోని యువ రైతులకు ఒక ఆదర్శంగా నిలిచారు.ప్రేరణ మరియు వ్యవసాయ ఆరంభం:కురుగుడు తాలూకాలోని దమ్మూరు గ్రామానికి చెందిన నితీష్ రెడ్డి, తన ఐటిఐ విద్యను పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం కోసం వెతకకుండా వ్యవసాయ రంగంలోకి అడుగుపెట్టారు. మహారాష్ట్రలోని కన్నేరి మఠానికి చెందిన పూజ్య శ్రీ కడసిద్ధేశ్వర స్వామిజీ అనుసరించే సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఆయన యూట్యూబ్ ద్వారా వీక్షించి, వాటి స్ఫూర్తితో తన చిన్న పొలంలో ప్రయోగాలు చేయడం ప్రారంభించారు.వివిధ రకాల పంటల సమ్మేళనం:

నితీష్ రెడ్డి తన పొలంలో కేవలం ఒకే పంటకు పరిమితం కాకుండా, పంటల వైవిధ్యాన్ని పాటించారు. ఆయన డ్రాగన్ ఫ్రూట్‌ను 2ఌ10 అడుగుల దూరంలో 'ఏ' ఆకారపు పద్ధతిలో సాగు చేస్తున్నారు. బళ్లారిలోని వేడి వాతావరణానికి అనుకూలంగా పెరిగే 330 ఆపిల్ చెట్లను ఆయన ఉప-పంటగా సాగు చేశారు.అంతే కాకుండా, పొలం చుట్టూ మిశ్రమ పంటలుగా కొబ్బరి, అరటి, బొప్పాయి, కరివేపాకు, నిమ్మ, సపోటా, బటర్ ఫ్రూట్ (అవకాడో), మోసంబి, జామ మరియు సీతాఫలం వంటి పండ్ల చెట్లను పెంచుతున్నారు.

డ్రాగన్ ఫ్రూట్ వరుసల మధ్య బెండ, దోస మరియు తమలపాకు వంటి కూరగాయలను సాగు చేయడం ద్వారా ఆయన తన భూమిని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారు.

సేంద్రియ వ్యవసాయం మరియు నిర్వహణ: పూర్తిగా రసాయన రహిత వ్యవసాయం చేయడమే వీరి లక్ష్యం. పరాగసంపర్కాన్ని పెంచి, మంచి దిగుబడులు సాధించేందుకు వీరు తేనెటీగల పెట్టెలను ఏర్పాటు చేశారు. జీవామృతం, పంచగవ్య, గోకృపామృతం మరియు ఘన జీవామృతం వంటి సహజ ఎరువులను వీరే స్వయంగా తయారు చేసుకుంటారు.

నూతన సాంకేతికత:





కొరియన్ సహజ వ్యవసాయ పద్ధతిలో భాగంగా, అరటి ద్రవ ఎరువు మరియు చేపల అమైనో ఆమ్లాలను వినియోగించడం ద్వారా ఆయన నూతన సాంకేతికతను అవలంబించారు.

సబ్సిడీ సౌకర్యం:జాతీయ వ్యవసాయ అభివృద్ధి పథకం మరియు సమీకృత వ్యవసాయ విధాన పథకం కింద, 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను, ఆవు, వానపాముల ఎరువు తయారీ తొట్టి మరియు తేనెటీగల పెట్టెలను కొనుగోలు చేసేందుకు గాను, వ్యవసాయ శాఖకు చెందిన కోలూరు రైతు సంప్రదింపు కేంద్రం నుండి ఆయన రూ. 30,000 సబ్సిడీని పొందారు.

ఆదాయం మరియు మార్కెటింగ్:

నితీష్ రెడ్డి కేవలం పంటలు పండించడానికే పరిమితం కాకుండా, యూట్యూబ్ ద్వారా మార్కెట్‌కు సంబంధించిన సరైన సమాచారాన్ని కూడా సేకరిస్తారు. ఆయన తన ఉత్పత్తుల నాణ్యత ఆధారంగా వాటిని వర్గీకరించి, స్వయంగా తానే విక్రయిస్తారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు ద్వారా ఆయన ఏటా సుమారు రూ. 1.5 లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

సన్మానాలు మరియు పురస్కారాలు:ఈ విజయాన్ని గుర్తించిన వ్యవసాయ శాఖ, 2025-26 సంవత్సరానికి గాను 'తాలూకా స్థాయి ఉత్తమ రైతు' (రైతు మహిళ) పురస్కారంతో నితీష్ రెడ్డి తల్లి నిర్మలను సన్మానించింది; అంతేకాకుండా, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించినందుకు గాను ధృవీకరణ పత్రాన్ని పొందే విధానం గురించి కూడా వారికి సమాచారం అందించింది. ఎటువంటి కూలీల సహాయం లేకుండా, కుటుంబ సభ్యులందరూ కలిసి సాగు పనుల్లో పాల్గొనడమే ఈ విజయం వెనుక ఉన్న రహస్యం అని అంటున్నారు నితీష్ రెడ్డి.